ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

# తెలంగాణ నవయుగ వైతాళికుడు - పాల్కురికి సోమనాథుడు

డా॥ ఎస్. నిశ్చల
తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్,వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ),విద్యానగర్, హైదరాబాద్
చరవాణి: 7680975761

Received: 25/05/2026
Article Accepted: 22/06/2026
Published Online: 24/06/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.2.187

వ్యాస సంగ్రహం :`

పాల్కురికి సోమనాథుడు 12, 13 శతాబ్దాల మధ్య జీవించారు. పాల్కురికి సోమనాథుని జన్మస్థలం 'పాల్కురికి' గ్రామం, వరంగల్ జిల్లా. పాల్కురికి సోమనాథుడు పాల్కురికిలో వెలసిన సోమేశ్వరుని అనుగ్రహంతో జన్మించడం వల్ల, ఈయన తల్లిదండ్రులు సోమనాథుడు అని పేరు పెట్టారు. వీరి తల్లిదండ్రులు శ్రీయాదేవి, విష్ణురామిదేవుడు.

సోమనాథుని రచనలన్నీ స్వతంత్రాలు. దేశీ రచన పరమలక్ష్యంతో సోమన రచనలు సాగించారు. అందువల్ల ద్విపద, శతకం, రగడ, గద్య, ఉదాహరణాలు మొదలైన స్వతంత్ర సాహిత్య ప్రక్రియలను చేపట్టి రచన సాగించారు.

వృషాధిప శతకం, అనుభవసారం, చతుర్వేదసారం, చెన్నమల్లు సీసములు సోమనాథుని పద్యకృతులు. బసవపురాణం, పండితారాధ్య చరిత్ర ద్విపదరచనలు. రుద్రభాష్యం, సోమనాథ భాష్యం, బసవరగడ, సద్గురు రగడ, పంచప్రకారగద్య నమస్కారగద్య, అక్షరాంక గద్య, బసవోదాహరణం, బసవలింగనామావళి మొదలైనవి వీరి లఘుకృతులు.

తెలంగాణజాతికి సోమనాథుడు అందించిన అపురూపకానుక ద్విపద. తనరచనలు జనసామాన్యానికి అర్థమయ్యేటట్లు ప్రజల భాషను వాహికగా ఎన్నుకున్నారు. జానుతెనుగు దేశికవితకు కీర్తి తెచ్చారు. సోమనాథుని రచన సరళం, గంభీరం, సౌందర్యమాధురీ భరితం. పాల్కురికి సోమనాథుని పాత్ర సృష్టి అద్భుతమైంది. సామాజిక జీవితానికి సన్నిహితమైనది. వీరి రచనల్లో పాత్రలు సహజంగా, సజీవంగా కన్పిస్తాయి. వైవిధ్యభరితంగా ఉంటాయి. వ్యావహారిక పదజాలంతో పాత్రల సామాజికత్వాన్ని మనోజ్ఞంగా చిత్రించారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

కీలకపదాలు: శివకవి, దేశీకవిత, ద్విపద, ఉదాత్తకావ్యరచన, ముగ్ధభక్తి, మాతృమూర్తి, విజ్ఞానసర్వస్వం, జానుతెనుగు, దేశిఛందస్సు, శివభక్తి.

పరిచయం:` దేశికవితోద్యమానికి ఆద్యుడు, తెలంగాణలో శ్రీకారం చుట్టినవారు పాల్కురికి సోమనాథుడు. చంపూ కావ్యానికి సమాంతరంగా ద్విపద కావ్యం అన్ని యుగాలలోనూ తనదైన విలక్షణ శైలితో సాగుతూనే వచ్చింది. ఈ ప్రక్రియను ఎదిగేలా పునాది వేసి ఆరంభించినవారు శివకవి పాల్కురికి సోమనాథుడే. సంస్కృతంలోని అనుష్టువు లాగా ద్విపద ఛందస్సును తెలంగాణ జాతి సంపదగా నిలబెట్టినవారు పాల్కురికి సోమనాథుడు. తాను స్వయంగా 'బసవపురాణం', 'పండితారాధ్య చరిత్ర' అనే రెండు ద్విపద కావ్యాలను రచించి చూపడమే కాక తర్వాత కవులు ద్విపద కావ్యాలను సృజించేందుకు మార్గం చూపారు. శివభక్తిని ఒక చైతన్యవంతంగా నడిపిన పాల్కురికి సోమనాథుడు ఆనాటి సమాజంలో అనేక విప్లవాత్మకమైన మార్పులకు నాందిపలికారు.

వ్యాసవివరణ:

ఉరుతర గద్యపద్యోక్తులకంటె
సరసమై బరగిన జానుతెనుంగు,
చర్చింపగా సర్వసామాన్యమగుట
గూర్చెద ద్విపదలు గోర్కిదైవార
......................................................
......................................................

దేశికవితా నాయకుడైన పాల్కురికి సోమనాథుడు ద్విపదను తెలుగు తెలంగాణ సాహిత్యంలో నిత్యనూతనంగా వెలుగొందేలా చేశారు. ద్విపద గొప్పతనాన్ని సర్వత్రా ప్రచారం చేస్తూ, ద్విపద కావ్యాలకు తెలుగు సాహిత్య చరిత్రలో ఒక సుస్థిరస్థానం కల్పించిన వారు నిస్సందేహంగా పాల్కురికి సోమనాథుడే. సోమన ఆనాటి గద్య పద్య ఉదాత్త కావ్యరచనలకు ధీటుగా తన ద్విపద రచనలను ఎంతో పరిణతమైన, ప్రౌఢమైన శైలిలో రచించి పండిత పామరులను సైతం మెప్పించగలిగారు.

పాల్కురికి సోమనాథుడు రచించిన మొట్టమొదటి ద్విపద కావ్యం బసవ పురాణంలో బసవులను ఈశ్వరునిగా భావించి వారి గురించి ఈ క్రింది పద్యములో ఉదాత్తంగా చెప్పారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

బసవాయనగ విన్న బాసలొండేల?

పసులకునైనను ప్రబలదే భక్తి?

బసవాయని జాలు బాసలొండేల?

వెసగాలు కార్చిచ్చు వెన్నెల గాదె?

బసవపురాణంలో సోమనాథుని ముగ్ధభక్తుల్లో ఒకరైన బెజ్జమహాదేవిని మాతృమూర్తిగా ఎంతో ఉదాత్తంగా తీర్చిదిద్దినవైనం 'నభూతో నభవిష్యతి'. బెజ్జమహాదేవి శివుడికి పరమ భక్తురాలు. సాక్షాత్తు ఆ పరమ శివుడికే తల్లిగా తనను తాను భావించుకొని బాల్యోపచారాలు చేయడం సహజంగా ఉంటుంది. తల్లి లేని శివుడిని తలుచుకొని ఆమెపడే బాధ ఈ క్రింది పద్యంలో వర్ణనాతీతం.

తల్లి గల్గిన నేల తపసిగానిచ్చు?

తల్లి గల్గిన నేల తల జడగట్టు?

తల్లి యున్న విషంబు త్రావ నేలిచ్చు?

తల్లి యుండిన తోళ్లు దాల్పనేలిచ్చు?

తల్లి పాముల నేల ధరియింపనిచ్చు?

తల్లి బూడిద యేల తాబూయనిచ్చు?

ఈ కావ్యం వివిధ తెలుగుకవుల చేత పద్యకావ్యంగా మళ్ళీ రచించబడింది. కన్నడ కవులు కూడా ఈ కావ్యాన్ని కన్నడంలోకి అనువదించారు. వస్తు, రూప, ఛందస్సు, శైలి తదితర అంశాల్లో దేశికావ్యమైన ఒక పరిపూర్ణ దేశిపురాణంగా ప్రప్రథమ తెలుగు తెలంగాణ స్వతంత్ర పురాణంగా నిలిచిపోయింది.

పండితారాధ్య చరిత్ర మల్లిఖార్జున పండితారాధ్యుడనే వీరశైవగురువు జీవితచరిత్రను వర్ణించే ప్రౌఢ ద్విపదకావ్యం శివకవి యుగంనాటి సాంఘిక సాంస్కృతిక పరిస్థితులను తెలుసుకోవడానికి పండితారాధ్య చరిత్ర ఒక విజ్ఞాన సర్వస్వం దొరుకుతుంది. ద్విపదవాఙ్మయంలో పండితారాధ్య చరిత్ర తరువాత కవులకు మార్గదర్శకమైంది. తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానాన్ని సంతరించుకున్నది. దీనిలో సోమన అప్పటి జాతీయాలు, పలుకుబడులు, సామెతలు, నదులు, కొండలు, గ్రామాలు, వివిధ మత సిద్ధాంతాలు, నేత్రరోగాలు, వస్త్రాలు, ఆభరణాలు, ఆటలు, పాటలు, వినోదాలు మొదలైన ఎన్నో విషయాలు తెలిపారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

తెలంగాణ భాషపై గల తన అభిమానాన్ని తను రచించిన పండితారాధ్య చరిత్రలో జాను తెనుగును ప్రవేశపెట్టి, భాషా స్వేచ్ఛను కోరుకొని ఆచరించి చూపిన తెలంగాణకవి పాల్కురికి సోమనాథుడు ఈ క్రిందివిధంగా చెప్పుకున్నారు.

"ఆరూఢగద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబుగాను
జానుతెనుగు విశేషము ప్రసన్నతకు"

పండితారాధ్య చరిత్రలో ద్విపద గూర్చి క్రింది విధంగా చెప్పుకున్నారు.

"ద్విపదాంబురుహముల ధృతి బసవేశు
ద్విపదాంబురుహముల హతి ప్రీతిబూంతు
సన్నుతి సేయుదు సత్కవులలర
తిన్నని నూక్తుల ద్విపద రచింతు"

ఈ విధంగా దేశీఛందస్సు ద్విపద పండితపామర జనాదరణ పొందడంలో సోమన సఫలమయ్యారు.

పాల్కురికి సోమనాథుడు జానపదులకు అందుబాటులో ఉండే భాషలో సాహిత్యాన్ని రచించారు. దేశీకవిత ప్రచారానికి సాహిత్యాన్ని మాధ్యమంగా తీసుకున్నారు. తద్వారా ప్రజల్లోకి సులువుగా దేశీసాహిత్యం చొచ్చుకుపోయింది. పాల్కురికి సోమన పండితుడైన శిష్టకవి కావడంవల్ల ఈ రచనలు శిష్టులకు, జానపదులకు మధ్య వారధిగా నిలిచాయి.

పాల్కురికి సోమనాథుడు తన వృషాధిప శతకంలో ఒక అద్భుతమైన జానుతెనుగు పద్యానికి అంకురార్పణ చేశారు. ఆ పద్యమే తరువాత కాలంలో అచ్చతెనుగు రచనలకు ప్రేరణ కలిగించిందనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ఈ క్రింది పద్యమే జనసామాన్యంలో నిలిచిపోయింది.

బలుపొడబాడతోలు సీరయును, ఃపెనల్, గిలుపారుకన్న వె
న్నెలతల, సేఃదుఃగుత్తకయు, నిండిన వేలుపుటేరు, వల్లు పూ
సలు గల రేని లెంకవని జానుతెనుంగున విన్నవించెదన్
వలపు మదిన్ దలిర్ప బసవా!బసవా!బసవా!వృషాధిపా!

ముగింపు:` పాల్కురికి సోమనాథుడు తన రచనల ద్వారా ఆనాటి సమాజంలోని హెచ్చుతగ్గులను నిర్మూలించి సమానత్వాన్ని చాటిచెప్పారని విశదమవుతుంది. బహుభాషా పండితుడు, సంస్కరణాభిలాషి, కొత్తప్రక్రియలతో భాషను సుసంపన్నం చేసిన యుగకర్త.

ఆధారగ్రంథాలు:


తెలుగు సాహిత్యచరిత్ర - ప్రథమభాగం - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి - యు.జి.సి ఎమెరిటస్ ఫెలో - తెలుగుశాఖ - ఆంధ్రవిశ్వకళాపరిషత్ - వాల్తేరు రమణశ్రీ ప్రచురణ - విశాఖపట్టణం - ప్రజోత్పత్తి -1991.

విభావన (వ్యాస సంపుటి) - డా. జి.వి. సుబ్రహ్మణ్యం - జి.వి.యస్. సాహితీ కళాపీఠం - హైదరాబాద్ - సెప్టెంబర్ - 1998.

కవిత్వానుసంధానం - కవిత్వ విశ్లేషణా వ్యాసాలు - డా. లక్ష్మణ చక్రవర్తి - ఆముక్త ప్రచురణలు - హైదరాబాద్ - ఆగస్ట్ - 2012

తెలుగు సంప్రదాయ కవిత్వం : సామాజిక నేపథ్యం (క్రీ.శ. 1000 - 1600) - కవి శిరోమణి ఆచార్య రావికంటి వసునందన్ - (పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం వారి ఆర్థిక సహాయంతో ముద్రితం) - హైదరాబాద్ - 2013

తెలంగాణ సాహిత్య వైశిష్ట్యం - ఆచార్య ఎస్వీ రామారావు - జయశంకర్ తెలంగాణ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ - హైదరాబాద్ - 2013.

ప్రథమాంధ్ర ప్రజాకవి - పాల్కురికి సోమనాథుడు - జాతీయ సదస్సు - (sజాశీలsశీతీvad by UG్పు - Sజు=O - HYణజు=AడిAణ) - ప్రధాన సంపాదకులు - జె. మల్లయ్య - తెలుగుశాఖ - ఎన్.ఎమ్. జి.డి.సి - జోగిపేట - మెదక్ జిల్లా - తెలంగాణ రాష్ట్రం - ఆగస్టు 1 Ê 2 - 2014.

తెలంగాణ సాహిత్యం - సమాలోచన - (పరిశోధక విద్యార్థుల సాహిత్య వ్యాసాలు) - ప్రధాన సంపాదకులు - ఆచార్య సూర్యా ధనంజయ్ - అధ్యక్షులు - తెలుగుశాఖ - ఉస్మానియా విశ్వవిద్యాలయం - ఫిబ్రవరి - 2019

అలుగు - సాహిత్యవ్యాసాలు - తెలంగాణ ప్రాచీన కవిత్వం - ఆధునిక కవిత్వం - వచన సాహిత్యాలకు చెందినవి - డా. త్రివేణి - విశ్వశ్రీ ప్రచురణలు - నిజామాబాద్ - డిసెంబర్ - 2019

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-2, (April,May&June), 2026

పునాస సాహిత్య త్రైమాసిక - తెలంగాణ సాహిత్య అకాడమీ - సంపాదకుడు - డా. నందిని సిధారెడ్డి - హైదరాబాద్ - జనవరి - మార్చి - 2020.

ప్రభాత సుమాలు ` పరిశోధన వ్యాసాలు - సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు - (సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో ముద్రితం) - హైదరాబాద్ - 2025.